# బిఎస్ఎన్ఎల్ - ఎంటిఎన్ఎల్ విలీన ప్రతిపాదన... ఎందుకోసం?

సాధారణ ఎన్నికల ప్రక్రియ మూలంగా యుపిఏ-2 ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్ విలీనం విషయంలో మరింత ముందుకు వెళ్లలేకపోయింది. నిజానికి మే 2013లోనే ఈ రెండు సంస్థల విలీనంపై డిపార్టుమెంటు ఆఫ్ టెలికం కేంద్ర మంత్రివర్గ ఉపసంఘానికి ఒక ప్రతిపాదన పంపించింది. అయితే మంత్రివర్గ ఉపసంఘం దీనిపై ఒక నిర్ణయానికి రాలేకపోయింది. ఆ తర్వాత 4.2.2014న బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంట్ అన్ని యూనియన్లు మరియు అసోసియేషన్లకు లేఖ రాస్తూ, ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై తమతమ యూనియన్లు మరియు అసోసియేషన్ల అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా కోరింది. ఈ రెండు సంస్థల విలీన ప్రతిపాదనలను పరిశీలించడానికి ఒక కమిటీని డిఓటి ఏర్పాటుచేసినట్లుగా కూడా బిఎస్ఎన్ఎల్ పేర్కొంది. వినబడుతున్న వార్తల ప్రకారం బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ మరియు ఐటిఐలను విలీనం చేయాలని ప్రతిపాదనలు వున్నట్లుగా ఒకవైపు, ఐటిఐ విలీనం వుండదని మరోవైపు విభిన్న వార్తలు ప్రచారంలో వున్నాయి.

ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్ విలీన ప్రతిపాదనను ముందుకు తీసుకు వెళుతోంది. వార్తా పత్రికలలో వచ్చిన వార్తల ప్రకారం 26.6.2014న ఈ రెండు కంపెనీల విలీన ప్రతిపాదనలను కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ తయారుచేసి, సంబంధిత శాఖ మంత్రి శ్రీ రవిశంకర్ ప్రసాదుగారి అనుమతి కోసం పంపినట్లుగా తెలుస్తోంది.

ఈ ప్రతిపాదిత నోటు ప్రకారం బిఎస్ఎన్ఎల్ వద్ద వున్న మొత్తం సెల్ టవర్లు అన్నింటికి ప్రత్యేక కంపెనీగా 100% ప్రభుత్వ కంపెనీగా ఏర్పాటుచేయలని, ఈ టవర్ల నిర్వహణ, ఆపరేషను, వాణిజ్య కార్యకలాపాలను ప్రైవేటు కాంట్రాక్టర్లతో నిర్వహించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. అలాగే బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్ వద్ద వున్న భూములను లీజుకు అమ్మకానికి టెండరు పిలవాలని కూడా ఆలోచన వుంది. అయితే ఈ ప్రతిపాదనలు కమ్యూనికేషన్ల మంత్రి ఆమోదించిన తర్వాత కేంద్ర న్యాయశాఖకు ఆ తర్వాత కేంద్ర మంత్రివర్గ ఆమోదానికి పంపుతారు. ఈ రెండు సంస్థల విలీనం వల్ల తలెత్తే వివిధ సమస్యలపై అధ్యయనం చేయడానికి వివిధ కమిటీలను ఏర్పాటుచేసినట్లుగా తెలుస్తోంది. సాంకేతిక అంశాలు, ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక సమస్యలు, రెండు సంస్థల విలీనం లాంటి అంశాలపై ఈ కమిటీలు ఏర్పడ్డాయి. ఈ కమిటీలను సమన్వయం చేయడం కోసం మరో కమిటీని ఏర్పర్చారు.

రెండు సంస్థల విలీన ప్రధాన ఉద్దేశ్యం దేశవ్యాప్త కార్యకలాపాల నిర్వహణ ఒకరే నిర్వహించటం. టెలికం శాఖ 21 ప్రధాన విధానపరమైన సమస్యలను, వాటిని తీర్చేందుకు తగిన కాల పరిమితులను నిర్ధారించింది. ఈ 21 రకాల సమస్యలను ఒక సంవత్సరకాలంలో పరిష్కరించాలని కూడా నిర్దేశించారు.

1) బిఎస్ఎన్ఎల్ లాగే ఎంటిఎన్ఎల్ కూడా 2009-10 నుండి వరుసగా నష్టాలలో వుంది. 2009-10లో 2514.87 కోట్లు, 2010-11లో 2801.92 కోట్లు, 2011-12లో 4018.45 కోట్లు, 2012-13లో 5321.12 కోట్లు, 2013-14లో 1908 కోట్లు నష్టాలలో ఎంటిఎన్ఎల్ వుంది. ఈ నాల్గు సంవత్సరాలలోని ఎంటిఎన్ఎల్ మొత్తం నష్టం 16564.36 కోట్లకు చేరుకుంది. 2013-14 సంవత్సరానికి వచ్చిన నష్టాలను కలుపుకుని బిఎస్ఎన్ఎల్‌కు వచ్చిన మొత్తం నష్టం ఇప్పటివరకు 32026.64 కోట్లకు చేరుకుంది.

2) 2012-13 ఆర్థిక సంవత్సరానికి ఎంటిఎన్ఎల్ ఆదాయం 3428.66 కోట్లు కాగా ఎంటిఎన్ఎల్ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఖర్చు 4901.37 కోట్లుగా ఉంది. ఈ రకంగా ఎంటిఎన్ఎల్‌కు వస్తున్న ఆదాయం ఆ సంస్థ ఉద్యోగుల ఖర్చులకే సరిపోవడం లేదు. ఎంటిఎన్ఎల్ ఆదాయంలో ఆ సంస్థ ఉద్యోగుల వేతనాల ఖర్చు శాతం 143 శాతంగా వుంది. బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగుల వేతనాల ఖర్చు శాతం 51 శాతంగా ఉంది.

3) ఎంటిఎన్ఎల్ లాభనష్టాల ఖాతాను పరిశీలిస్తే 2012-13 సంవత్సరానికి ఎంటిఎన్ఎల్ నికర విలువ 2784.43 కోట్లుగా వుంది. 2011-12 సంవత్సరానికి ఎంటిఎన్ఎల్ నికర విలువ 2536.70 కోట్లుగా వుండేది. మార్చి 2009 నాటికి ఎంటిఎన్ఎల్ నికర విలువ 12059.37 కోట్లుగా వుండేది. ఎంటిఎన్ఎల్ నికర నష్టాలు 14656 కోట్లు కాగా, నికర విలువ (-) 2784.43 కోట్లుగా వుంది. ఒక సంస్థ యొక్క నికర ఆస్తులు, నికర అప్పులను పరిశీలించి ఆ సంస్థ విలువను నిర్ధారిస్తారు. ఈ రకంగా ఎంటిఎన్ఎల్ నికర విలువ ఇప్పటికే మైనస్‌లోకి వెళ్లింది. కనుక ఎంటిఎన్ఎల్ దివాలా తీసే సంస్థగా సిద్ధంగా వుంది. 31.3.2012 నాటికి బిఎస్ఎన్ఎల్ నికర విలువ 71,171 కోట్లు కాగా 31.3.2013 నాటికి బిఎస్ఎన్ఎల్ నికర విలువ 65,341.91 కోట్లు.

4) వడ్డీలు, పన్నులు చెల్లించడానికి ముందు ఎంటిఎన్ఎల్ ఆదాయం, ఆదాయంలో డిప్రిసియేషన్ తగ్గించిన తర్వాత 31.3.2013 నాటికి వడ్డీ చెల్లింపు శాతం- 3.49గా వుండి, ఎంటిఎన్ఎల్ తీసుకున్న అప్పుల పై వడ్డీ కూడా కట్టలేని స్థితిలో వుంది.

5) ఎంటిఎన్ఎల్ కరెంటు రేషియో 31.3.2013 నాటికి 0.46గా వుంది. కరెంటు రేషియో అంటే ఎంటిఎన్ఎల్ తన అప్పులు, చెల్లించే స్థాయి ప్రస్తుత ఎంటిఎన్ఎల్ తన అప్పులను, వడ్డీలను తిరిగి చెల్లించే స్థాయిలో లేదు.

6) 31.3.2013 నాటికి ఎంటిఎన్ఎల్ బకాయిలు 29,188 కోట్లుగా వుంది. ఎంటిఎన్ఎల్ ఆస్తులు 26,400 కోట్లుగా వుంది. అంటే ఆస్తుల కంటే అప్పులే ఎక్కువగా వున్నాయి.

7) ఎంటిఎన్ఎల్‌లో ప్రభుత్వ వాటా 56.25 శాతంగా వుంది. వివిధ ఆర్థిక సంస్థల వాటా 21 శాతంగానూ, ప్రజల షేర్ల వాటా 8.15%, ఆర్థిక సంస్థల వాటా 4.82%, ఇతర కంపెనీల వాటా 3.06%, ఇతరులకు 0.58%, ఎన్ఆర్ఐల వాటా 0.24%, జాతీయ బ్యాంకుల వాటా 0.04%.

8) 2009-10 నుండి బిఎస్ఎన్ఎల్ నష్టాలలో వున్నా, ఎంటిఎన్ఎల్ కంటే పరిస్థితి మెరుగ్గా వుంది. ఎంటిఎన్ఎల్‌కు వున్న అప్పులన్నీ రద్దుచేసి, ఎంటిఎన్ఎల్ నికర విలువను ఆస్తులను పరిరక్షించాలి.

9) విలీనం వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించి ఎంటిఎన్ఎల్‌ను లాభాలలో నడిచే సంస్థగా చేసి అప్పుడు విలీనంపై దృష్టి సారించాలి.

10) ఎంటిఎన్ఎల్‌లో 43.75% పెట్టుబడుల ఉపసంహరణ జరుగగా బిఎస్ఎన్ఎల్ 100% ప్రభుత్వ కంపెనీ, కనుక ఈ దశలో విలీనం జరిగితే కొత్త సంస్థలో కూడా పెట్టుబడుల ఉపసంహరణ జరిగినట్లుగా పరిగణించబడుతుంది. కనుక ఎంటిఎన్ఎల్‌లోని వాటాలను ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేసి పూర్తి ప్రభుత్వరంగ సంస్థగా విలీనం జరగాలి. కేంద్ర మంత్రివర్గ ఉపసంఘం సూత్రప్రాయంగా బిఎస్ఎన్ఎల్‌లోని టవర్ల నిర్వహణను, అన్ని టవర్లతో ఒక ప్రత్యేక కంపెనీ ఏర్పాటును నిర్ణయించింది. ఇందుకోసం డిఓటి/బిఎస్ఎన్ఎల్ విధివిధానాలు రూపొందిస్తున్నాయి.

నేషనల్ టెలికం పాలసీ 2012 ప్రకారమే ఈ మార్పులు జరుగుతున్నాయి. నేషనల్ టెలికం పాలసీ 2012 ఈ రకంగా పేర్కొంటోంది.

"3.3 - యూనిఫైడ్ లైసెన్సు విధానం వైపుగా వెళ్లడానికి కన్వర్జెన్సు వల్ల కలిగే ప్రయోజనాలను రాబట్టడానికి, స్పెక్ట్రమ్ విధానాన్ని సరళీకరించి టెలికం ఆపరేటర్లు తమ తమ నెట్‌వర్క్‌ని సర్వీసుల నుండి స్పెక్ట్రమ్ లైసెన్సును విడదీయడం ద్వారా వినియోగదారునికి మరింత ప్రయోజనం కలిగించాలన్నది విధానం. ఈ నూతన లైసెన్సు విధానం ద్వారా అందరు టెలికం కంపెనీలకు సమాన అవకాశాలు, సర్వీసుల నిర్వహణలో, విలీనాలు మరియు కొనుగోళ్లలో, ఇంటర్ కనెక్షన్లలో తగిన పోటీ వాతావరణాన్ని కల్పించగలం."

"9.2 - డిపార్టుమెంటు ఆఫ్ టెలికం కింద నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను తగు విధంగా రీస్ట్రక్చర్ చేయాలి. ఇందుకోసం మేనేజ్ మెంట్‌లోనూ, ఉద్యోగ శక్తి వినియోగంలోనూ, సంస్థల ఈక్విటీలోనూ మార్పులు జరగాలి."

కనుక జాతీయ టెలికం విధానం 2012 ప్రకారం బిఎస్ఎన్ఎల్‌ను సర్వీసుల కంపెనీగానూ మరియు నెట్‌వర్క్ కంపెనీగానూ విడగొట్టాలన్న విధానంలో భాగంగానే కొత్త టవర్ల కంపెనీ ఏర్పాటు నిర్ణయం అన్నది తేటతెల్లం.

కనుక బిఎస్ఎన్ఎల్‌ను ఎంటిఎన్ఎల్‌ను మూడుగా అంటే టవర్ల కంపెనీ, భూముల కంపెనీ, మరియు సర్వీసుల కంపెనీగా విడగొట్టి ఆపైన బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్‌ను విలీనం చేయాలన్నది ఆలోచనగా కన్పిస్తోంది.

ఆపైన బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్‌లలో పెట్టుబడుల ఉపసంహరణను ప్రారంభించవచ్చునన్నది అసలు ఆలోచన. దీనికి తోడుగా ఈ రెండు సంస్థల విలీనం వల్ల అనేక రకాలైన సమస్యలు ఉద్యోగులకు వస్తాయి. వీటి పరిష్కారం కూడా కష్టం కావచ్చు.

11) బిఎస్ఎన్ఎల్‌లో దాదాపు 3300 మంది క్యాజువల్ మరియు టిఎస్ఎం ఉద్యోగులు వుండగా ఎంటిఎన్ఎల్‌లో 19 టిఎస్ఎంలు వున్నారు. వారిని రెగ్యులర్ చేయడం విలీనం కంటే ముందు జరగాలి.

12) నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల నియామక రూల్సు రెండు సంస్థలలో సమానంగానే వున్నా, ఆయా క్యాడర్ల వేతన స్కేళ్లలో వ్యత్యాసాలు వున్నాయి. ఎంటిఎన్ఎల్‌లో వేతన స్కేళ్లు ఎక్కువగా వున్నాయి.

13) మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు ప్రకారం వచ్చే వేతన సవరణలో ఈ వేతన స్కేళ్లను సమానం సాధించాల్సి వుంది. అయితే వరుసగా ఈ రెండు సంస్థలకూ వస్తున్న నష్టాలను పరిశీలిస్తే, వేతన సవరణ సాధ్యం కాకపోతే పరిస్థితి ఏమిటి? వ్యత్యాసాల

సవరణకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఎంటిఎన్ఎల్‌లో 68.8% డి.ఎ. విలీనం పైననే వేతన స్కేళ్లు నిర్ధారణ కాగా బిఎస్ఎన్ఎల్‌లో 78.2% డి.ఎ. విలీనం పై వేతన సవరణ జరిగింది. ఎంటిఎన్ఎల్ తన ఉద్యోగులు 78.2% విలీనం పైన బిఎస్ఎన్ఎల్ స్కేళ్లు తీసుకునే ఆప్షను సౌకర్యాన్ని కల్పిస్తానంటోంది. కానీ వేతనాలలో వచ్చే తగ్గుదల వల్ల ఎంటిఎన్ఎల్ ఉద్యోగులకు జరిగే నష్టాలకు బాధ్యులెవ్వరు? ఒకవేళ కొంతమంది ఎంటిఎన్ఎల్ ఉద్యోగులు ఇలా ఆప్షను ఇచ్చినా ఒకే కంపెనీలో రెండు రకాలైన వేతన స్కేళ్లు వుండటం సాధ్యమేనా? దీనికి పరిష్కారం ఒక్కటే! ఎంటిఎన్ఎల్ ఉద్యోగుల వేతన స్కేళ్లను 78.2% డి.ఎ. విలీనంపైన చేసి, ఆ స్కేళ్లపై డిఓటి పెన్షను చెల్లించాలి.

14) అయితే ఎంటిఎన్ఎల్ యూనియన్లతో 3.9.2013న ఒప్పందంలో ఇలా వుంది. "ఎంటిఎన్ఎల్‌లోని దాదాపు అన్ని వేతనస్కేళ్లు, బిఎస్ఎన్ఎల్‌లోని వేతన స్కేళ్ల కంటే ఎక్కువగా వున్న దృష్ట్యా, ఎంటిఎన్ఎల్‌లో విలీనమైన ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్లు ప్రభుత్వం చెల్లించేటపుడు, బిఎస్ఎన్ఎల్‌లోని సమానమైన వేతన స్కేళ్ల పై మాత్రమే ఈ పెన్షనరీ బెనిఫిట్లు చెల్లిస్తారు. ఒకవేళ ఎంటిఎన్ఎల్ ఈ పెన్షనరీ బెనిఫిట్లను ఎంటిఎన్ఎల్ వేతన స్కేళ్లపై చెల్లించాలని నిర్ణయిస్తే ఆ అదనపు భారాన్ని ఎంటిఎన్ఎల్ భరించాల్సి వుంటుంది. కనుక ఈ రకమైన వ్యత్యాసాలను తొలగించడానికి ఈ రెండు సంస్థలలో ఒకే రకమైన వేతనాలు సాధించాల్సి వుంటుంది.

15) దీనికి అనుగుణంగానే డిఓటి ఉత్తర్వు నెం. 42-4/2012-పెన్షను (7), తేది 24.8.2014 ద్వారా డిఓటి సర్వీసు మరియు ఎంటిఎన్ఎల్ సర్వీసు కలిపి లెక్కించే ఆప్షను ఇచ్చిన ఉద్యోగులకు 1.10.2000 నుండి బిఎస్ఎన్ఎల్‌లో మాదిరిగానే పెన్షనరి బెనిఫిట్లు చెల్లించడానికి అంగీకరించింది. ఎంటిఎన్ఎల్ చెల్లించే ఈ పెన్షనరీ బెనిఫిట్లలో బిఎస్ఎన్ఎల్‌లోని సమానమైన వేతన స్కేళ్ల పై వచ్చే పెన్షనరీ బెనిఫిట్లు చెల్లింపునకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. మిగతా మొత్తాన్ని ఎంటిఎన్ఎల్ భరించాల్సి వుంటుంది. ఈ అదనపు మొత్తాన్ని ముందుగానే ప్రభుత్వానికి ఎంటిఎన్ఎల్ చెల్లించాల్సి వుంటుంది. ఈ విధానం వచ్చే వేతన సవరణలో ఎంటిఎన్ఎల్ మరియు బిఎస్ఎన్ఎల్ ఒకే రకమైన వేతన స్కేళ్లు సాధించేవరకు అమలులో వుంటుంది.

16) కనుక ఈ రెండు సంస్థల విలీనం వల్ల పెన్షను మరియు వేతన స్కేళ్ల విషయంలో తీవ్రమైన సమస్యలు ఏర్పడే అవకాశం వుంది. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు వేతన సవరణ 78.2% డి.ఎ. విలీనంపై జరిగిన దృష్ట్యా ఎంటిఎన్ఎల్ ఉద్యోగులు బిఎస్ఎన్ఎల్ వేతన స్కేళ్లకు ఆప్షను ఇస్తే సరిపోతుందన్న అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది.

17) బిఎస్ఎన్ఎల్‌లోని ప్రమోషన్ విధానం కాలపరిమితికి మరియు ఉద్యోగికి ఇచ్చిన బెంచ్ మార్కింగ్ ప్రకారం వుండగా ఎంటిఎన్ఎల్ ప్రమోషన్ విధానంలో డిపిఇ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగి బెంచ్ మార్కింగ్ చాలా స్ట్రిక్టుగా వుంది. కానీ ఎంటిఎన్ఎల్ ఉద్యోగులు ఇవన్నీ చాలా చిన్న విషయాలుగా పరిగణిస్తున్నారు.

18) ఎంటిఎన్ఎల్‌లోని ప్రమోషను విధానంలో క్రింది కాల పరిమితులతో ప్రమోషన్లు అమలు అవుతున్నాయి.
ఎన్ఇ-1 నుండి ఎన్ఇ-2కు 8 సం॥లు, ఎన్ఇ-2 నుండి ఎన్ఇ-3కు 8 సం॥లు, ఎన్ఇ-3 నుండి ఎన్ఇ-4కు 5 సం॥లు, ఎన్ఇ-4 నుండి ఎన్ఇ-5కు 5 సం॥లు, ఎన్ఇ-5 నుండి ఎన్ఇ-6కు 4 సం॥లు, ఎన్ఇ-6 నుండి ఎన్ఇ-7కు 8 సం॥లు, ఎన్ఇ-7 నుండి ఎన్ఇ-8కు 8 సం॥లు, ఎన్ఇ-8 నుండి ఎన్ఇ-9కు 5 సం॥లు, ఎన్ఇ-9 నుండి ఎన్ఇ-10కు 4 సం॥లు, ఎన్ఇ-10 నుండి ఎన్ఇ-11కు 4 సం॥లు, ఎన్ఇ-11 నుండి ఎగ్జిక్యూటివ్ స్కేలు ప్రమోషన్‌కు 2 సం॥లు, ఎన్ఇ-5 వరకు వచ్చే ప్రమోషన్లు సీనియారిటీ మరియు అర్హతల మీద ఆధారపడి కాగా, ఎన్ఇ-5 నుండి ఎన్ఇ-6కు ప్రమోషన్లలో ఎస్ఎస్‌సి విద్యార్హత వున్నవారికి వాక్ ఇన్ ప్రమోషను, ఎస్ఎస్‌సి లేనివారికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి టిఎం లేదా టిఓఏ ప్రమోషను ఇస్తున్నారు. ఎన్ఇ-6 నుండి ఎన్ఇ-11 వరకు ప్రమోషను సీనియారిటీ మరియు అర్హతల ఆధారంగా ఇస్తున్నారు. ఎన్ఇ-11 నుండి ఎగ్జిక్యూటివ్ స్కేలు ప్రమోషన్లు, 31 సం॥ల సర్వీసు చేసిన ఉద్యోగికి, ఖాళీల లభ్యతను బట్టి ఆయా పోస్టులకు తగిన విద్యార్హత వుంటేనే ఇస్తున్నారు. హెచ్ఆర్‌డి, వెల్ఫేరు, ఎస్టాబ్లిష్‌మెంటు, రిక్రూట్‌మెంటు, ట్రైనింగు, పరీక్షలు, లీగల్, సెక్యూరిటీ లాంటి వాటిలో 50% ఈ ఉద్యోగాలకు డిపార్టుమెంటల్ కోటాలో ఇస్తారు. ఎన్ఇ-11 నుండి ప్రమోషనుకు 10% కేటాయించారు. 1.4.2009 నుండి ఎంటిఎన్ఎల్‌లో ఎన్ఇ-12 పే స్కేలు అమలుచేశారు. ఎన్ఇ-11లో మూడు సంవత్సరాలు వుండి స్టాగ్నేషను వస్తే వారికి మాత్రమే ఎన్ఇ-12 స్కేలు ఇస్తున్నారు.

19) బిఎస్ఎన్ఎల్ మెడికల్ పాలసీ ప్రకారం ఔట్‌డోర్ ట్రీట్‌మెంటుకు రీయంబర్సుమెంటు మరియు సిజిహెచ్ఎస్ రేట్ల ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రులలో ఇన్‌డోరు ట్రీట్‌మెంటు ఉచితంగా అమలులో వుంది. అయితే ఎంటిఎన్ఎల్‌లో ఔట్‌డోరు ట్రీట్‌మెంటు రీయంబర్సుమెంటు వుంది. కానీ ఇన్‌డోర్ ట్రీట్‌మెంటుకు హెల్త్ ఇన్సూరెన్సు స్కీము వుంది.

20) పెర్క్స్ మరియు అలవెన్సుల విషయంలో రెండు సంస్థలలోనూ కొన్ని అలవెన్సులు ఆపటం, పెంచకపోవడం వుంది.

21) లీవ్ రూల్సు రెండు సంస్థలలోనూ దాదాపు ఒకే విధంగా వున్నాయి.

22) బిఎస్ఎన్ఎల్‌లో కారుణ్య నియాయకాల విధానం కొనసాగుతుండగా ఎంటిఎన్ఎల్‌లో నియామకాలను పూర్తిగా రద్దు చేశారు.

23) బిఎస్ఎన్ఎల్‌లో పదవీ విరమణ లేదా విఆర్ఎస్ సమయంలో లీవు ఎన్‌క్యాష్‌మెంటు మొత్తాన్ని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషనుకు బిఎస్ఎన్ఎల్ చెల్లించిన మొత్తంలో నుండి ఎల్ఐసి చెల్లిస్తోంది. ఎంటిఎన్ఎల్‌లో ఇలాంటి సదుపాయం లేదు.

## ముగింపు

***బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎన్ఎల్ విలీనం వల్ల కలిగే ప్రయోజనాలు***

1) పాన్ ఇండియా సర్వీసు సౌకర్యం వల్ల ఎంటిఎన్ఎల్ దేశవ్యాప్త సర్వీసులు ఇవ్వగలుగుతుంది. ఎంటిఎన్ఎల్ నెట్‌వర్క్‌ని వాడుకోవడం ద్వారా ముంబాయి, ఢిల్లీలలో బిఎస్ఎన్ఎల్ సర్వీసులు ఇవ్వగల్గుతుంది.

2) వ్యాపార, వాణిజ్య వినియోగదారులను ఆకర్షించడం ద్వారా పోటీ ప్రపంచంలో మార్కెట్ వాటా పెంచుకోవచ్చు.

3) విలీనం వల్ల భూముల, భవనాల ఇతర స్థిరాస్థుల విలువల పెరుగుదల వల్ల పెట్టుబడులను ఆకర్షించవచ్చు.

***విలీనం వల్ల కలిగే నష్టాలు***

విలీనం వల్ల కలిగే నష్టాలను పై ప్రయోజనాలు తీర్చగలిగే పరిస్థితి లేదు. ఆ నష్టాలు ఏమిటంటే-

1) ఎంటిఎన్ఎల్ నికర విలువ (-)లలో వుండటం వల్ల బిఎస్ఎన్ఎల్‌కు నష్టం. ఎంటిఎన్ఎల్ అప్పులను పూర్తిగా రద్దుచేసి ఎంటిఎన్ఎల్‌ను నికర ఆదాయంలోకి తెస్తే తప్ప ప్రయోజనం కలగదు. విలీనం వల్ల ఏర్పడ్డ కంపెనీ నష్టాలు విలీనం తర్వాత ఏర్పడ్డ కంపెనీ నికర విలువలో 50% కంటే ఎక్కువ వుంటే సిక్ కంపెనీగా ప్రకటించాలి. కనుక ప్రభుత్వం ఈ మేరకు సహాయం చేయాల్సి వుంటుంది.

2) విలీనం తర్వాత ఏర్పడ్డ కంపెనీలో పెట్టుబడుల ఉపసంహరణ జరిగినట్లుగా పరిగణించబడుతుంది. కనుక ప్రభుత్వం ఎంటిఎన్ఎల్ లోని షేర్లను కొనుగోలు చేయాల్సి వుంటుంది.

3) డిఓటి ఉత్తర్వు నెం. 42-4/2012-పెన్షను(టి), తేది 28.4.2014 ప్రకారం ఎంటిఎన్ఎల్‌లో రిటైరైన ఉద్యోగులకు ఎంటిఎన్ఎల్ పే స్కేళ్ల పై కాకుండా తత్ సమానమైన బిఎస్ఎన్ఎల్ పే స్కేళ్ల పై చెల్లిస్తారు. ఎంటిఎన్ఎల్ వేతన స్కేళ్ల పై పెన్షను చెల్లిస్తే ఆ మిగతా మొత్తాన్ని ఎంటిఎన్ఎల్ భరించాలి. వచ్చే వేతన సవరణలో ఎంటిఎన్ఎల్ స్కేళ్లను, బిఎస్ఎన్ఎల్ స్కేళ్ల స్థాయికి తగ్గించాలి. కానీ రెండు కంపెనీల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వచ్చే వేతన సవరణ జరిగే అవకాశం లేదు. కనుక ఇప్పుడు విలీనం జరిగితే వేతన స్కేళ్ల వ్యత్యాసం ఏర్పడుతుంది. కనుక విలీనానికి ముందే బిఎస్ఎన్ఎల్ వేతన స్కేళ్లను ఎంటిఎన్ఎల్ స్కేళ్ల స్థాయికి పెంచి ఈ సమస్యను పరిష్కరించాలి.

కనుక ప్రభుత్వం ఎంటిఎన్ఎల్ అప్పులను పూర్తిగా రద్దు చేయడానికి, ఎంటిఎన్ఎల్ నికర విలువ లాభాలలో చూపించే ప్రయత్నం చేయడానికి, విలీనం తర్వాత ఏర్పడే కంపెనీ, మొత్తం నష్టాలు 50% కంటే తక్కువ వుండేలా ఆ కంపెనీ విలువను పెంచేందుకు తగిన ఆర్థిక సహాయం చేయడానికి, ఎంటిఎన్ఎల్‌లోని షేర్లనన్నింటినీ పూర్తిగా కొనడానికి బిడబ్ల్యుఎ స్పెక్ట్రమ్ కోసం చెల్లించిన మొత్తాలను రెండు కంపెనీలకు పూర్తిగా చెల్లించేందుకు, ఎంటిఎన్ఎల్ వేతన స్కేళ్లను 78.2% డి.ఎ. విలీనం పై నిర్ణయించి, ఆ వేతన స్కేళ్లను బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అమలుచేయడానికి, ఎంటిఎన్ఎల్ మరియు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సర్వీసు నిబంధనలలో ఏది మెరుగ్గా వుంటే దాన్ని అమలు చేయడానికి అంగీకరిస్తే, రెండు సంస్థల విలీనం వల్ల ఏర్పడే సంస్థ మనుగడ కొనసాగుతుంది. పై పేర్కొన్నవన్నీ ప్రభుత్వం అంగీకరించే అవకాశం లేదు కనుక మన పోరాటం కొనసాగించాలి.

BSNLEU

**బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్**
**ఆంధ్రప్రదేశ్ సర్కిల్**